# ''వేయింగ్ మిషన్''

నారాయణరావు, రఘురామి రెడ్డి ఇరువురు ఎంతో ప్రాణస్నేహితులు అని చెబితే రామరావణుల బంధం కాదు, గాని సీతారాముల బంధమని చెప్పవచ్చు. అదిగూడా తక్కువే. అయితే రామలక్ష్మణుల బంధం మాత్రం వీరి బంధానికి కొంచెం దగ్గరగా వుండవచ్చు. కాని, ఈ విషయం మీద ఇప్పుడు చర్చ ఎందకు? వారి మధ్యను ఉన్న అన్యోన్యత చాలా గాఢమైంది. అని చెప్పడం సమంజసంగా వుంటుంది. బాల్యం నుంచీ వారిరువురూ సహపాఠులు. ఇద్దరూ కలసి ఇంజనీరింగ్ చదవడానికి కర్నాటక రాష్ట్రం వెళ్లివచ్చారంటే ఆ అన్యోన్యత ఇంకా సువ్యష్టంగా తెలిసిపోతుంది - వాళ్లిద్దరూ చదువులో అంతగొప్ప ఏకలవ్యతేమీ లేదని, చదువులో ఎప్పుడూ అగ్రగణ్యులుగా వుండేవాళ్లు. జీవితాస్వాదనలో వెనక బెంచివాళ్లుగానే వుంటారు. మన రఘురాముడు, నారాయణుడు ఆటలు, పాటలు, నవ్వులు ఏమీ వదలకుండా కౌమారదశ అంతా ఆనందంగా గడిపాడు. యవ్వన ప్రాయం గురించి ఇంక చెప్పనే అఖ్ఖర్లేదు.

అప్పుడు సీతాకోక చిలుకల్లా విహరిస్తున్నా, ఇప్పుడు మంచి ఉద్యోగ పదవులు అలంకరిస్తున్నారు. దీన్నించి మనం తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే వాళ్లు ఆడుతూ, నవ్వుతూ గడిపే రోజుల్లో కూడా చదువుపట్ల ఏలాంటి అశ్రద్ధ చూపించ లేదు. అందుకే వారు ఈరోజు మంచి ఉద్యోగాలు సంపాదించి తమ జీవితాల్ని సార్థకం చేసుకొన్నారు. కాని, ఉద్యోగాల వల్లమాత్రమే జీవితాలు సార్థకం అవుతాయా? లేదు, అందుకే వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడడానికి శక్తి రాగానే తలా ఒక జోడు 'స్పెషల్' కాళ్లను కూడా సంపాదించారు. ఈరోజు నారాయణరావు ఇద్దరమ్మాయిలకు తండ్రిగా వున్నారు. అయితే రఘురాముడికి ఏమైందో గాని పాపం అమ్మాయిలు పుట్టలేదు. మరి అసలు పిల్లలే పుట్టలేదా? ఛ అదేం ప్రశ్న? అసలు రఘురాముడి మాదిరే రఘురామ రెడ్డికి పదునాలుగు సంవత్సరాలకు పైగా పిల్లలు పుట్టకుండా వుంటారా? పెళ్లికి ముందే రెడీగా వున్న రెడ్డికి పెళ్లైన పదినెలల లోపల ఒక కొడుకు పుట్టాడు. (ఒక చిన్న సవరణ. కొడుకు పుట్టేది అతని కళాత్రానికే). తరువాత రెండు సంవత్సరాల్లో ఇంకో కొడుకు పుట్టాడు. దానితో రఘురాముడు వెళ్లి ఒక లఘు ఆపరేషన్ చేసుకొని వచ్చాడు. ''పరిమిత కుటుంబం - సుఖమైన కుటుంబం.''

ఇదే కాలంలో నారాయణరావు కూడా దాదాపు అలాగే చేశాడు. వ్యత్యాసం చాలా చిన్నదయినా పెద్దదనీ చెప్పవచ్చు. ఇద్దరమ్మాయిల్ని ప్రసవించిన శ్రీమతి నారాయణ రావుకు కూడ అలాంటి ఆపరేషన్ జరిగింది. నారాయణ రావుకు ఇద్దరు కూతుళ్ళే పుట్టినందుకు అసలు బాధే లేదు. అట్లా కాకుండా చాలా సంతోషంగా వున్నాడు. ఆయన శ్రీమతికి రెండో బిడ్డ గూడా ఆడపిల్లే అని తెలిసిన క్షణం నుంచే క్షీణత మొదలయింది. క్షీణత అంటే అది శారీరకంగా కానే కాదు. అది లోపలి మనస్సుకు

మాత్రమే పరిమితం. పెళ్లికి ముందే ఆమె కొంచెం లావుగా వుండేది. బాగా అన్నం, సాంబారు, నెయ్యి, వెన్న అన్నీ తినే ఆ శాకాహారి స్త్రీకి తన ఆకారాన్ని తగ్గించుకుందా మనే ఉద్దేశ్యం ఎక్కువగా వుండేది కాదు. నారాయణడికైతే ఆ 'డన్‌లప్-పిల్లో' అంటే చాలా ఇష్టం. పుల్లలాంటి పిల్లని తిరిగి చూడడం కూడా ఆయనకు ఇష్టం వుండేది గాదు. చూడడానికి ఏదైనా పుష్టిగా కనిపిస్తూ వుండాలి కదా!

కాని కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స తర్వాత రెండు సంవత్సరాల ఆమె 'ఎగ్జిబిషన్ బెలూన్' లాగ అయిపోంది. అందువల్ల ఆమె తన 'ట్యూబెక్టమీ ఆపరేషన్' ప్రతిరోజూ తిట్టుకునేది. కాని, ఉదర దిశవైపు అహోరాత్రులు చేసే ఎగుమతిని కొంచెం గూడా తగ్గించడం తన శ్రీమతికి యిష్టం లేదని, దానివల్లే ఆమె లావు తగ్గడం లేదనే విషయం నారాయణరావుకు బాగా తెలుసు. కాని, అది ఆమె ముందు చెప్పటానికి అతనికి ధైర్యం లేదు. అతనే 'వాసెక్టమీ ఆపరేషన్' చేసుకోమంది. మగ పిల్లవాడి కొఱకు అత్యాశపడుతున్న ఆ తల్లి ఏదైనా ''ఫారెన్ నోహౌ'' ద్వారా (విదేశీయ పరిజ్ఞాన కౌశలం వల్ల) ఒక సుపుత్రుడికి జన్మ ఇవ్వడానికి పుత్రకామేష్టి యాగం చేస్తుందేమోనని అతనికి భయంగా వుండేది. అందుకే, శస్త్రక్రియను ఆమెకే చేయించాడు.

శ్రీమతి రఘురాముడైతే భలే 'ఫిగర్ కాన్షియస్'. మరీ సన్నగా వుండకపోయినా, ఆమె సుందర శరీరంలో అవసరమైన ఒక అరకిలో 'మటన్' ఎక్కడా కనుపించదు. నిత్యం రకరకాల వ్యాయామాలు చేయడంతోపాటు ఆహార పదార్థాలు ఎంతో సంతులితంగా ఆమె తీసుకుంటుంది.

ఆమె తన పెనిమిటిని, పిల్లల్ని కూడా, అలాంటి క్రమశిక్షణా పద్ధతిలోనే తీర్చి దిద్దింది.

ఈ రెండు కుటుంబాల మధ్య చాలా దగ్గర సంబంధాలు ఈ మధ్యకాలం వఱకు వుండేవి. ప్రక్క ప్రక్క కాకపోయినా కూడా, ఈ రెండు కుటుంబాలు కనీసం వారానికి ఒకసారియైన సాయం సంధ్యలు కలిసి గడిపేవి. అలాంటి సందర్భాలలో నారాయణ, రఘురాములు, రెండు మూడు పెగ్గులు సేవించేవారు. ఇది నారీ - నారాయణులకు అంత ఇష్టం లేకున్నా కూడా ఆమె అప్పుడు వ్యతిరేకత ప్రదర్శించేది కాదు. దానికి, వేరొక రహస్య కారణం కూడావుంది. ఆమెకు ''బాడీ మసాజ్'' (ఒళ్లు పట్టడం) అంటే చాలా ఇష్టం. కావి, ఒక కుటుంబస్త్రీ, అలాంటి కోరిక గురించి, చెప్పకూడదు గదా? నారాయణుడు బాగా తాగిన రాత్రులలో ఆమె శరీరంలో దాదాపు అరవై శాతం శరీరానికి మసాజు లభించేది. వందశాతం వఱకు చెయ్యాలంటే దానికి ప్రత్యేక శిక్షణ పొందినవారు కావాలికదా! పాపం, ఆ నారాయణుడు, ఆ మొత్తం కార్యక్రమం స్వయంగా చేశాడంటే తర్వాత మూడు రోజులకు సెలవు తీసుకోవాల్సిన దయనీయ స్థితికి చేరతాడు.

కనీసం వారానికొకసారి ఆరెండు కుటుంబాలు కలుస్తాయని చెప్పుకున్నాం గదా అలాంటి సమ్మేళనాలు నారాయణుడి ఇంట్లో కావచ్చు లేదా రఘురాముడి ఇంట్లో కావచ్చు. అప్పుడప్పుడు క్లబ్బుల్లో కూడా ఆరెండు కుటుంబాలు ఒక్కొక్కప్పుడు సినిమాకు గాని లేదా ఏమైనా సాంస్కృతిక కార్యక్రమాలకు వెళ్ళి అటునుంచి మంచి హోటల్‌కు కూడా వెళ్లి భోజనం చేసేవారు. రఘు, నారాయణులు గ్లాసులు బలాబలాలు చూకునేటప్పుడు, నవ్వులు, తమాషాలు ఆస్వాదంచేటప్పుడు, వాళ్ల ధర్మదారలు ఇంటి విషయాలు లోకాభిరామాయణం మాట్లాడుకునేవారు. వాళ్ల మధ్యలో మంచి స్నేహబంధం వున్నా గూడా శ్రీమతి నారాయణునికి శ్రీమతి రాఘురాముడి పట్ల చాలా అసూయగా వుండేది. దానికి కారణాలు రెండు. ఆమె చూడడానికి చాలా అందంగా ఉండటం; ఆమెకు ఇరువురూ మొగపిల్లలే కావడం.

నారాయణుడి అమ్మాయిలిద్దరికీ తల్లిపోలికే. మంచి గ్లాక్సో బేబేల మాదిరే వుంటారు. వాళ్ల లావును అదుపులో పెట్టడం గురించి, అంటే, ఆ పిల్లల చేత కొంచెం వ్యాయామం చేయించడం గురించి ఒకసారి శ్రీమతి రఘురాముడు, తన స్నేహితురాలికి కొర్దిగ ఉపదేశం ఇవ్వడానికి ప్రయత్నించింది. దానితో ఆ తెల్ల స్నేహితురాలి ముఖం మాత్రం నల్లగా మారింది. శ్రీమతి రఘురాముడికి అది అర్థమయింది కూడా.

మరో రోజు నారాయణుడు రఘురామ్ ఆఫీసుకు వెళ్లి, తన ధర్మపత్ని అమర్షం (కినుక) గురించి తన స్నేహితుడికి సువ్యక్తం చేశాడు. తన ''టుంటున్'' కు ఆమె లావు గురించి గాని, పిల్లల లావు గురించి ఎవరైనా వేలెత్తి చూపడం అసలు నచ్చేది కాదు. తరవాత రఘురాముడు తన భార్యకు దాన్ని గురించి ''ట్యూషన్'' చెప్పాడు.

కొంతకాలం గడచిపోయింది. ఆ ఇద్దరి స్నేహితురాళ్ల మధ్య నున్న అరమరిక మాసిపోయింది. మనసులో ఏమున్నా గూడా, శ్రీమతి నారాయణుడు, తన స్నేహితురాలితో సాన్నిహిత్య పరంగా ఎలాంటి విముఖత ఇప్పుడు ప్రదర్శించడం లేదు.

అలావుండగా ఒకరోజు నారాయణ దంపతుల పదో పెళ్ళిరోజు వచ్చింది. ఒక మంచి బహుమతి కొని ఇవ్వాలనుకున్న రఘురాముడు ఒక పెద్ద షాపుకు వెళ్లి ఎంత వెతికినా గూడా నచ్చిన వస్తువు దొరకలేదు. ఇంత వఱకు ప్రతియేడూ వచ్చే ఆ స్నేహితుని పెళ్లిరోజుకు పిల్లల జన్మదినాలకు తాను ఎన్నో బహుమతులు ఇచ్చి వున్నాడు. అదికాకుండా నారాయణుడి ఇంట్లో ఏమేముందో గూడా రఘురాముడికి బాగా తెలుసు. అందుకే ఆ ఇంట్లో లేని ఒక మంచి వస్తువు కొనాలి అని ఆయన ప్రయత్నం.

రెండు మూడు షాపుల్లోకి వెళ్ళి వెదికాక ఒక మంచి వస్తువు ఎట్టకేలకు దొరికింది. అది చాలా అందంగా వుంది. ఎంతో ఉపయోగమైనది కూడా. నారాయణయే

ఇంతవరకు దాన్ని కొనలేదు కూడా.

అది లేత నీలంరంగులో వుండే ఒక ''వేయింగ్ మిషన్'' దాన్ని చాలా అందంగా ప్యాక్ చేయించి దానిపై 'శుభాశీస్సులతో రఘురామ్' అని రాసిన చిన్న కార్డు కూడా అతికించించాడు.

ఆ విందుకు ఒక పది, పన్నెండు మంది దంపతులను మాత్రమే ఆహ్వానించి పిల్లలతో సహా అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా. ప్రతి ఒక్కరు ఏదో ఒక బహుమతిని తీసుకొచ్చారు. శ్రీమతి, శ్రీ రఘురాములు చాలా ప్రేమతో, అభిమానంతో వాళ్లు తెచ్చిన గొప్ప బహుమతిని శ్రీమతి నారాయణుడికి మంగళాసీస్సులతో అందజేశారు.

పార్టీ చాలా గొప్పగా జరిగింది. అది ముగిసేటప్పటికి రాత్రి రెండు గంటలయ్యింది. ఆ తరవాత రోజు ఆదివారం కావటంవల్ల ఎంతసేపున్నా ఎవరికీ అభ్యంతరం అనిపించలేదు.

మర్నాడు ఉదయం దాదాపు 9 గంటలు అయి వుంటుంది. రఘురాముడు వరండాలో కూర్చుని టీ త్రాగుతూ దినపత్రిక చదువుతున్నాడు. గేటు దగ్గర ఒక కారు వచ్చి నిలబడింది. రఘురామ్ తల ఎత్తి చూశాడు. తల దించుకొని, చేతిలో ఒక ప్యాకెట్ పట్టుకొని, చాలా అలసిపోయిన వాడిలా మెల్లమెల్లగా నారాయణుడు లోపలికి వస్తున్నాడు. వెంటనే రఘురామ్ బయటకు వెళ్లి అతడికి స్వాగతం పలికాడు.

''ఏమిటీ ఇంత ప్రొద్దున్నే వచ్చావు? పది గంటలకు ముందు నీవు నిద్ర లేస్తావని కూడా నేను అనుకోలేదు.''

''లేచే వాడిని కాదురా, కాని ఏడుగంటలు అయ్యేటప్పటికే ఆమె భద్రకాళి అవతారం ఎత్తింది''.

''ఏమైంది? పార్టీలో ఏమైనా గొడవ జరిగిందా?''

''నీతో నేను ఇంతకు ముందే చాలాసార్లు చెప్పాను, ఆమె లావు గురించి ఎలాంటి ఆనవాలు చేయవద్దని''

''నిన్న రాత్రి రాధ దాన్ని గురించి ఏమైనా మాట్లాడిందా?''

''మాట్లాడడమా? అసలు నా కొంప ముంచావు గదయ్యా''

''అయ్యో! అదేంటి?''

''నిన్న బహుమతిగా నువ్వేమిచ్చావు?'' అది ఆమె ఈరోజు ఉదయం తెరిచి చూచుకోడంతో, పోలేరమ్మలా మొత్తం ఇంటినే తలక్రిందులు చేసింది. ఆమెకు లావెక్కునైతే మీకెందుకు నష్టం అని ఆమె అడుగుతోంది. వెంటనే దీన్ని మీ

ముఖంమీద పారేసి, మీరెవరూ ఇకముందు ఆమె కళ్లముందు కనబడగూడదని చెప్పి రమ్మని ఇంత ఉదయమే నన్ను పంపించింది.''

''అయ్యొయ్యో, అలాంటి ఉద్దేశ్యం మాకెప్పుడూ లేదే, నాకు ఆ వస్తువు చూడగానే నచ్చింది. నీ ఇంట్లో ఇలాంటి వస్తువు లేదుకూడా. కాని, దేవుడా, ఎంత పెద్ద తప్పు నేను అనుకోకుండా చేశాను! అదిలా ఇచ్చేసెయ్, మేమిద్దరం నీతో వచ్చి ఆమెను క్షమాపణ కోరుతాము''.

''వద్దు, వద్దు. అసలు నేను కూడా మీతో ఇకముందు మాట్లాడ కూడదని ఆమె ఆర్డర్. మీరెవరు కూడా ఆవైపు రావద్దు... కనీసం కొంతకాలం వరకు. ఆమె కోపం చల్లారాలి అంటే కనీసం కొంత సమయం పడుతుంది. ఇప్పుడు మీరు అక్కడకు వచ్చి అనవసరంగా గొడవ పెంచకండి. నేనే ఎప్పుడైనా ఆఫీసుకు వచ్చి నిన్ను కలుస్తాను. సారీరా, నువు రాధతో గూడ, చెప్పి, ఆమెను సమాధాన పఱచు...

వేయింగ్ మిషన్ రఘురామ్ చేతిలో పెట్టి, నారాయణుడు తిరిగి వెళ్తూ, చేతులతో కళ్లను తుడుచుకోవడం రఘురామ్ గమనించాడు.

---